## మత్తడివాగును ఆధునీకరించాలి

ఆదిలాబాద్, జిల్లాలోని తాంసి మండలం వడ్డాడి సమీపంలో నిర్మించిన మత్తడివాగు ప్రాజెక్టు కుడికాలువ నిర్మాణంతో 1200 ఎకరాలకు సాగునీరు అందనుంది. దీనిని పూర్తిస్థాయిలోకి అందుబాటులోకి తీసుకుని వస్తే రైతులకు మేలు జరుగనుంది. జిల్లాలోని తాంసి, ఆదిలాబాద్, జైనథ్ మండలాల రైతుల భూములకు సాగునీరు అందించేందుకు తాంసి మండలం వడ్డాడిలో 2004లో మత్తడివాగు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2008 ఆగస్టులో ప్రాజెక్టు పనులు పూర్తి అయ్యాయి. ఈ కాలువ ద్వారా వడ్డాడి, కప్పర్ల, బండలనాగాపూర్, జామిడి, చాందా-టి. సిర్సన్న, ఘోరజ్, సావర్‌గాం, తరోడ, మల్లాపూర్ భీంసరి, జందాపూర్ గ్రామాల్లోని 8500 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంగా పనులు చేపట్టారు. ప్రాజెక్టు కుడికాలువ నిర్మాణంతో 1200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. రైతులు పంటలు సాగుచేసే ప్రతి ఎకరానికి సాగునీరు అందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రాజెక్టుల ఆధునీకీకరణతో ఆయకట్టు భూములు సస్యశ్యామలంగా మారను న్నాయని రైతులు అంటున్నారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :108 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 21-06-2024 | పేజీలు:4 వెల: 2.00


## అగ్నిగుండంలా ఢిల్లీ...



న్యూఢిల్లీ,ఉత్తర భారత దేశం అగ్నిగుండంలా మారింది. దేశరాజధాని ఢిల్లీ సహా పంజాబ్, హరియాణా, చండీగఢ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో భానుడు విశ్వరూపం చూపిస్తున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు 43 నుంచి 45 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతున్నాయి. ముఖ్యంగా రాజధాని ఢిల్లీలో పరిస్థితి దారుణంగా ఉంది. ఢిల్లీ మొత్తం నిప్పుల కొలిమిలా మారింది. మరోవైపు నీటి సంక్షోభంతో ఢిల్లీ వాసులు అల్లాడుతున్నారు. రాత్రి సమయంలో వాతావరణం కూడా చల్లబడటం లేదు. గత 14 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా రాత్రి వేళ కూడా రాజధానిలో 35.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో వడదెబ్బకు ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారు. వడదెబ్బ బాధితులతో ఆసుపత్రులన్నీ కిక్కిరిపోతున్నాయి.ఇక ఉండేందుకు ఇల్లు లేక ఫుట్‌పాత్‌లపైనే కాలం వెళ్లదీస్తే నిరాశ్రయుల పరిస్థితి గురించైతే చెప్పాల్సిన అవసరం లేదు. జూన్ 11 నుంచి జూన్ 19వ తేదీ వరకూ తొమ్మిది రోజుల వ్యవధిలో ఏకంగా 192 మంది నిరాశ్రయులు ప్రాణాలు (నిరాశ్రయులు మరణించారు) కోల్పోయారు. వడదెబ్బ కారణంగానే వీరంతా మరణించారని ఎన్జీవో సెంటర్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్ (NGO సెంటర్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్) గుర్తించబడింది. ఎన్జీవో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్ కుమార్ అలెడియా మాట్లాడుతూ.. 'జూన్ 11 నుంచి 19వ తేదీ వరకు తీవ్రమైన వేడి పరిస్థితుల కారణంగా ఢిల్లీలో 192 మంది నిరాశ్రయులయ్యారు' అని తెలిపారు.కాగా గత ఐదేళ్లలో నమోదైన అత్యధిక మరణాలు ఇవే అని ఎన్జీవో విడుదల చేసింది. 2019 జూన్ 11 నుంచి 19 వరకూ 143 మంది, 2020లో జూన్ 11 నుంచి 19 వరకూ 124 మంది, 2021లో జూన్ 11 నుంచి 19 వరకూ 58 మంది, 2022లో జూన్ 11 నుంచి 19 వరకూ 150 మంది, 2023 జూన్ 19 వరకు మరణించారు.ఇప్పుడు ఏకంగా 192 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వివరించింది.

## ఇందిరా పార్క్ వద్ద నిరుద్యోగుల మహా ధర్నా...

హైదరాబాద్ : రాష్ట్రంలోని నిరుద్యోగులు ధర్నాల బాట పట్టారు. గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 పిలవాలని, గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులు పెంచాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగారు. ఇందిరా పార్కు వద్ద చేపట్టిన ఈ ధర్నాకు పలు పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు మద్దతు తెలిపారు.గ్రూప్-2లో 2 వేల పోస్టులు, గ్రూప్ -3లో 3 వేల పోస్టులకు పెంచాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. దీనితో పాటు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రూప్-2, 3 రాతపరీక్షలను డిసెంబర్ వరకు వాయిదా వేయాలన్నారు. ఇక జీవో 46ను రద్దు చేయాలన్నారు.ధర్నాకు హాజరైన సింధూజ(న'ల్లగొండ) మాట్లాడుతూ.. తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారి డిమాండ్లను నెరవేరుస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చార'ని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవటం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.మరో నిరుద్యోగ అభ్యర్థి ఈశ్వర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీలు బల్మూర్ వెంకట్, చింతపండు నవీన్ కుమార్ ఇద్దరు ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఎన్నో హామీలిచ్చారు. ఇప్పుడు ఎమ్మెల్సీలు అయ్యాక నిరుద్యోగుల బాధలను



పట్టించుకోవటం లేదంటూ వాపోయారు. నిరుద్యోగుల సమస్యలపై వారిద్దరూ స్పందించడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వానికి వంత పాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో జారీ చేసిన 30 వేల ఉద్యోగాలకు రేవంత్ నియామక పత్రాలిచ్చి తానే భర్తీ చేసినట్టు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నెల అవుతున్నా, ఇప్పుడు ఏడు వఱకు ఒక్క కొత్త నోటిఫికేషన్ రాలేద'న్నారు.

## టీచర్ల పదోన్నతుల బదిలీ ఉత్తర్వుల జాప్యం.. ఉపాధ్యాయుల నిరసన

ఆదిలాబాద్ : ఉపాధ్యాయుల పదోన్నతుల బదిలీ ఉత్తర్వులపై విద్యాశాఖ ఎడతెగని జాప్యం చేయడాన్ని నిరసిస్తూ గురువారం ఆదిలాబాద్ డీఈవో కార్యాలయం ఎదుట భాషా పండితులు నిరసన చేపట్టారు. తప్పులు తడకగా జాబితాలు రూపొందించి ఆ తర్వాత సరిదిద్దామని ప్రకటన జారీ చేసి, మూడు రోజులైనా ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యాయుల చేతికి ఇంతవరకు ఉత్తర్వులు రాకపోవడంపై టీచర్లు అసహనం వ్యక్తం చేశారు.పదోన్నతి కోసం జిల్లాలో 110 మంది భాషా పండితులు గంటల తరబడి వేచి చూస్తున్నారని, అధికారుల నుండి స్పష్టమైన సమాధానం రావడం లేదని భాషా పండితుల సంఘం నాయకులు వాపోయారు. అనంతరం డీఈఓ ప్రణీతను కలిసి పరిస్థితి వివరించగా.. డీఈవో విద్యాశాఖ ఆర్జెడి లింగయ్యతో మాట్లాడి పదోన్నతుల ఉత్తర్వుల గురించి వివరించారు. ఈరోజు ఎలాగైనా తప్పనిసరిగా ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇవ్వడంతో భాషా పండితులు వెనుదిరిగారు.

బయో సైన్స్.. సోషల్ కేటగిరి ఎస్ జి టి లకు పదోన్నతి..

స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ల కోసం వేచి చూస్తున్న బయోలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ ఎస్ జి టి ఉపాధ్యాయులకు గురువారం పదోన్నతి ఉత్తర్వులు జారీ చేశారు. బయోసైన్స్ విభాగంలో 27 మంది, సోషల్ స్టడీస్ కేటగిరిలో 44 మందికి విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేయగా వారంతా కేటాయించిన స్కూల్లలో



చేరిపోయారు.

ఎస్ జి టి బదిలీలకు దరఖాస్తులు..

పదోన్నతుల ప్రక్రియ చివరి అంకానికి చేరుకోగా .. మరోవైపు ఎస్ జి టి ఉపాధ్యాయుల బదిలీలపై గురువారం ఆదిలాబాద్ జిల్లా విద్యాశాఖ దరఖాస్తులు స్వీకరించింది. 2024 జూన్ 1వ తేదీ వరకు ఒకే పాఠశాలలో 8 సంవత్సరాలు సర్వీస్ నిండిన ఉపాధ్యాయులు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని డిఇఓ ప్రణీత పేర్కొన్నారు. ఈ మేరకు బదిలీల కోసం టీచర్ల నుండి డీఈవో కార్యాలయంలో లిఖితపూర్వక దరఖాస్తులు స్వీకరించారు. ఖాళీలను బట్టి వీరిని భర్తీ చేయనున్నారు.

## ప్రతిపక్షనేత సంచలన కామెంట్స్..



బెంగళూరు: రాష్ట్రంలో ఏడాది పాలన ముగియగానే తొలి వికెట్‌గా వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో రూ.187కోట్ల అవినీతిలో మంత్రి నాగేంద్ర రాజీనామా చేశారని, ఇక రెండో వికెట్ ముఖ్యమంత్రి సిద్దరామయ్యే అని ప్రతిపక్షనేత అశోక్‌సంచలన వ్యాఖ్యలు చేశారు. గ్యారెంటీలు అమలు చేయడంతో ఖజానా ఖాళీ అయ్యిందన్నారు. నగరంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ, సిద్దరామయ్య, డీకే శివకుమార్ కాంగ్రెస్ నుంచి నిధులు ఇవ్వడం లేదన్నారు. ప్రజల నుంచి భారీగా పిండుకునేందుకు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ద్విచక్రవాహనాన్ని శవం తరహాలో మోసుకెళ్లిన సిద్దరామయ్య ప్రస్తుతం ఎలా ధరలు ఎలా పెంచుతారని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో 20 సీట్లు గెలుస్తామని ధీమాలో ఉండేవారని, ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని విమర్శించారు.ఏడాది పాలనలో అభివృద్ధికి ఒకరూపాయి కూడా ఖర్చు చేయలేదని ధ్వజమెత్తారు. ముద్దెబిహాళ్ ఎమ్మెల్యే నాడగౌడ అభివృద్ధి పనులు కుంటుపడిన విషయాన్ని బహిరంగంగా చెప్పారన్నారు. నియోజకవర్గంలో తిరిగే పరిస్థితి లేకుండా పోతోందని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వాపోతున్నారని అన్నారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. రోడ్లు, పాఠశాలలు, ఆసుపత్రులలోనూ అభివృద్ధి లేకుండా పోయిందని పేర్కొన్నారు. బీజేపీ పాలనలో బొమ్మై ముఖ్యమంత్రిగా పదవిని కోల్పోయినప్పుడు రెవెన్యూలోటు లేదని, అప్పులు లేవన్నారు. సిద్దరామయ్య ఏడాదిపాలనలో అప్పులు పెరిగాయని ఆర్థిక పరిస్థితి అధ్వానం చేశారని అన్నారు. ఎందుకోసం పాలన సాగిస్తున్నారో అంటూ ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ పెంపుతో సామాన్యులపై భారం మోపారని మండిపడ్డారు.

## బీఆరెస్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఇళ్లపై ఈడీ దాడులు



హైదరాబాద్,పటాన్‌చెరు బీఆరెస్ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఇంటిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు నిర్వహిస్తున్నది. గురువారం ఉదయం 5 గంటల నుంచి పటాన్‌చెరులోని ఆయన నివాసంలో అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి ఇంట్లోనూ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. తెల్లవారుజామున పటాన్ చెరు చేరుకున్న 40మంది అధికారుల బృందం పటాన్‌చెరులోని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డితో పాటు ఆయన సోదరుడు మధుసూధన్‌రెడ్డి నివాసంలో తనిఖీలు చేస్తున్నారు. నిజాంపేటలోని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అల్లుడు చంద్రశేఖర్, బంధువుల ఇళ్లలో కూడా సోదాలు చేపట్టారు.ఈడీ సోదాల విషయం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. గూడెం మహిపాల్ రెడ్డి సోదరులు ఇద్దరు మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో ఓ కేసులో మహిపాల్ రెడ్డి సోదరుడు గూడెం మధు అరెస్ట్ కాగా ప్రస్తుతం ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. లక్డారం గనుల వ్యవహారంలో గతంలో పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో మధుసూదన్‌రెడ్డిపై కేసు నమోదయింది. దాని ఆధారంగా ఈడీ అధికారులు సోదాలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. లక్డారంలోని ఎమ్మెల్యే ఫ్యామిలీ అక్రమ మైనింగ్‌పై స్థానికులతోపాటు పటాన్ చెరు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత నందీశ్వర్ గౌడ్ స్వయంగా ప్రధానికి గతంలో ఫిర్యాదు చేశారు.అక్రమ మైనింగ్‌లో భారీగా అవకతవకలకు తెరలేపడంతో పాటు పెద్దఎత్తున భూ అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో నిన్ననే మహిపాల్ రెడ్డి రూ.3 కోట్ల ఖరీదైన ల్యాండ్ క్రూయిజర్ కారును కొనుగోలు చేశారనే ప్రచారం జరుగుతోంది. తనిఖీలు చేపట్టిన ఈడీ అధికారులు ఖరీదైన కారును గుర్తించడంతో పాటు పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కాగా రాష్ట్రంలో బీఆరెస్ నుంచి పార్టీ మారుతారన్న ఎమ్మెల్యేల జాబితాలో మహిపాల్‌రెడ్డి పేరు కూడా వినిపిస్తున్న నేపథ్యంలో ఈడీ దాడులు సాగడం విశేషం.

## అటు లోకేష్-ఇటు పవన్... చంద్రబాబుకు సమ ఉజ్జీలా?

అమరావతి,టీడీపీ అధినేత, ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పీడు అందరికీ తెలిసిందే. రోజుకు 18 గంటల పాటు అవిశ్రాంతంగా కష్టించే ఆయన.. పాలనపై తనదైన ముద్ర వేసిన విషయం కూడా ఎరుకే. ఇప్పుడు కూడా అదే స్పూర్తితో ఆయన పని చేస్తున్నారు. పాలనలో తన ముద్ర కనిపించేలా.. స్పీడుగా పని చేసే అధికార యంత్రాంగాన్ని ఆయన నియమించుకుంటున్నారు. ఒక వైపు పెట్టుబడులు.. మరోవైపు అభివృద్ధి.. ఇంకోవైపు సంక్షేమం.. ఇలా ఈ మూడు అంశాల ప్రాతిపదికగా..చంద్రబాబు పాలన సాగించేందుకు రెడీ అవుతున్నారు.అయితే.. ఇప్పుడు ఈయనకు సమ ఉజ్జీలుగా.. మంత్రివర్గంలో ఎవరున్నారు? అనేది ప్రశ్న. నిజానికి మంత్రి వర్గ కూర్పును చూసుకుంటే.. పార్టీలు ఏవైనా.. నాయకులు ఎవరైనా.. కూడా చంద్రబాబు యువతకు పెద్దపీట వేశారు. 50-55 ఏళ్ల వారినే ఎక్కువగా నియమించుకున్నారు. అదేవిధంగా 40-45 ఏళ్ల వారికి కూడా ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో వారంతా పోటీ పడి తనతో పాటు పరుగెత్తుతారని చంద్రబాబు అంచనా వేసుకున్నారు. ఈ క్రమంలోనే సీనియర్లను ఆయన దాదాపు పక్కన పెట్టారు.ఆనం రామనారాయణరెడ్డి వంటి ఒకరి ద్దరికి మాత్రం మినహాయింపు ఇచ్చి.. చంద్రబాబు తన మంత్రి వర్గంలో చోటు కల్పించారు. అయితే.. యువ మంత్రులు ఇంకా బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. ఇక, ఇప్పటి వరకు బాధ్యతలు చేపట్టిన వారిలో.. అటు నారా లోకేష్, ఇటు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు దూసుకుపోతున్నారు. నారా లోకేష్.. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి.. ఉదయం 7 గంటలకే విధుల్లోకి దిగుతున్నారు. తన ఇంట్లోనే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నారు. ఇది 10 గంటల వరకు ఉంటోంది. అనంతరం.. ఆయన సమీక్షలు చేస్తున్నారు. ఉన్నతాధికారులతో



మాట్లాడుతున్నారు. అదే సమయంలో విద్యార్థులకు అందాల్సిన సౌకర్యాలు కూడా అందించేలా నిర్ణయాలను వడి వడిగా తీసుకుంటున్నారు. రాత్రి 9 గంటల వరకు విధుల్లోనే ఉంటున్నా రు. ఇక, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ సహా ఇతర శాఖల మంత్రిగా బుధవారం బాధ్యతలు చేపట్టిన పవన్ కల్యాణ్ కూడా.. తొలి రోజే దూకుడు ప్రదర్శించారు. ఉదయం 10.53కు బాధ్యతలు చేపట్టిన ఆయన నిర్విరామంగా రాత్రి వరకు సమీక్షలు.. చర్చలతోనే గడిపారు.అటవీ శాఖ, పంచాయతీ శాఖ సహా..తనకు కేటాయించిన నీటిసరఫరా శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించారు. అంతేకాదు.. కొన్ని ఆదేశాలు కూడా జారీ చేశారు. మొత్తంగా ఆయన కార్యాలయంలోనే 10గంటలపాటు ఉన్నారు. ఈ పరిణామాలు చూస్తే.. చంద్రబాబు స్పీడుకు.. అటు నారా లోకేష్, ఇటు పవన్‌లు సమ ఉజ్జీలుగా ఉన్నారని అంటున్నారు పరిశీలకులు.

## పార్టీ మారడం లేదు...అసత్య ప్రచారాలు నమ్మొద్దు...

హైదరాబాద్,తాను పార్టీ మారడం లేదని కొద్ది రోజుల నుండి సోషల్ మీడియాలో తనపై వస్తున్నటువంటి అసత్య ప్రచారాలను ఎవరూ నమ్మకండని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మోసపూరిత హామీలను కార్యకర్తలకు విశధీకరిస్తూ, రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు ఎలా కృషి చేయాలో ప్రణాళికలు సిద్ధం చేసుకునేందుకు ఇవాళ పర్వతగిరిలో మీటింగ్ పెట్టడం జరిగింది.కాంగ్రెస్ ప్రభుత్వం చేసినటువంటి మోసపూరిత హామీలు ప్రజలు ఇకనైనా తెలుసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 4000 పెన్షన్ చేస్తానని, ఇప్పటివరకు ఆ ఊసే లేదన్నారు. అదే పక్క రాష్ట్రంలో 4000 పెన్షన్ ఇస్తున్నారు, ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిచి ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఇప్పటివరకు రైతుబంధు డబ్బులు రైతుల అకౌంట్లోకి జమ కానే లేదు, ఆరు గ్యారెంటీలు అమలు కాకపోతే ప్రజలే వారికి బుద్ధి చెప్పే రోజులు ముందున్నాయన్నారు.కాంగ్రెస్ పార్టీ వాళు సోషల్ మీడియా వేదికగా చేసుకొని తాను పార్టీ మారుతానని దుష్ప్రచారం చేస్తున్నారు, వారు ఇకనైనా ఇలాంటి దుష్ప్రచారాలు మాని ప్రజల బాగు కోసం



ఆలోచించి వారికి పనిచేస్తే బాగుంటుందన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకి మళ్లీ పూర్వ వైభవం రానుందని తెలిసి అది జీర్ణించుకోలేని కాంగ్రెస్ వాళ్లు ఇలాంటి పనికిమాలిన ప్రచారాలను చేస్తున్నారన్నారు. తాను పార్టీ మారడం లేదు.. ఈ పార్టీలోనే ఉంటూ పార్టీ పూర్వ వైభవం కోసం పని చేస్తానని, మళ్లీ కేసీఆర్ సీఎం అయ్యేంతవరకు అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

## బండి సంజయ్‌ను కలిసిన గ్రూప్ 1 అభ్యర్థులు..



హైదరాబాద్,గ్రూప్-1 అభ్యర్థులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను కలిశారు.గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల కోసం ప్రిలిమ్స్ నుండి 1:100 చొప్పున ఎంపిక చేసేలా చూడాలని నిరుద్యోగులు ఆయనను కోరారు. గత నాలుగేళ్లలో మూడు సార్లు గ్రూప్ 1 పరీక్షలను రద్దు చేయడం వల్ల నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరిగిందని వారు మంత్రి ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే 1:100 చొప్పున మెయిన్స్ కు ఎంపిక చేస్తామని గత ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చిన విషయాన్ని నిరుద్యోగులు గుర్తు చేశారు.అధికారంలోకి వచ్చి 6 నెలలైనా పట్టించుకోవడం లేదని నిరుద్యోగులు వాపోయారు. గ్రూప్ 1 పోస్టులు అత్యధికంగా ఉండటం వల్ల 1: 50 చొప్పున మెయిన్స్ కు ఎంపిక చేస్తే నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేరళ రాష్ట్రంలో గ్రూప్ 1 మెయిన్స్ కు 1:75 చొప్పున ఎంపిక చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వం 1:100 చొప్పున మెయిన్స్ కు ఎంపిక చేశారన్నారు.ఇచ్చిన హామీ నెరవేర్చకపోతే భారీ ఎత్తున ధర్నా చేస్తామని నిరుద్యోగులు తెలిపారు. నిరుద్యోగుల డిమాండ్ న్యాయమైనదేనని బండి సంజయ్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 1:100 చొప్పున మెయిన్స్ కు ఎంపిక చేయాలని బండి సంజయ్ అన్నారు.నిరుద్యోగుల డిమాండ్ ను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

## సంపాదకీయం

శుక్రవారం 21-06-2024

# పర్యావరణ విధ్వంసంపై యుద్ధం చేయాలి

ప్రపంచవ్యాప్తంగా విపరీత వాతావరణ పరిస్థితులు చూస్తున్నాం. కొండలను ధ్వంసం చేస్తున్నాం. చెట్లను నరికి వేస్తున్నాం. చెరువులను కాలువలను మింగేశాం. అడవులను విధ్వంసం చేశాం.వన్యప్రాణులను మింగేశాం. అందుకే వర్షాకాలంలో ఎండాకాలం చూస్తున్నాం. నైరుతి రుతుపవనాలు ప్రవేశించినా పూర్తి స్థాయి వర్షాల జాడలేకుండా పోయింది. భూమ్మీద రోజురోజుకీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అకాల వర్షాలు, తుపానులు, పిడుగులు వంటి విపత్తులను పరిశీలిస్తే రానున్న రోజులలో భూగోళంపై సమస్త జీవరాశుల ఉనికి ఎలా ఉంటుందో ఏమో అనే సందేహం కలుగుక మానదు. వీటికి ఎన్నో కారణాలు ఉన్నప్పటికీ కారణం ప్రకృతి విధ్వంసం..మానవ తప్పిదాలే అని చెప్పక తప్పదు. మనిషి తన స్వార్థంకోసం పర్యావరణ విధ్వంసానికి కారణమవుతున్నాడు. పుడమిని కాలుష్యమయం చేసి ప్రకృతి పట్ల తీసుకొన్న అనాలోచిత చర్యలు ఫలితమే ఈ విపత్తులు. విపరీతమైన ప్లాస్టిక్ వినియోగం కూడా పర్యావరణాన్ని దబ్బతీస్తోంది. మానవుడు తనంతట తాను ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతున్నా..పాలకులు చర్యలకు ఉపక్రమించడం లేదు. వరదలు,విపరీతమైన ఎండలు ప్రకృతి విధ్వంసం వల్ల..మానవ జనాభా విస్ఫోటనం వల్లనే అని తెలిసీ దిద్దుబాటు చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. అందుకే వానాకాలం ఎండలకు జనం పిట్టల్లా రాలడం అంటే ఎట్లుంటుందో ఇప్పుడు తెలుస్తోంది.జూన్ నెల సగం గడిచినా ఎండా, ఉక్కపోతలు తగ్గడం లేదు. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉత్తరం,దక్షిణం, పశ్చిమం,తూర్పు అని తేడా లేకుండా దేశమంతా తీవ్ర మంచినీటి సమస్యలను ఎదుర్కొంటోంది. ఉత్తర భారతంలోని చాలా ప్రాంతాల్లో అసాధారణ వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ వేసవిలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉన్నందున గుండెపోటు మరణాలూ సంభవించాయి. ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉన్న కారణంగా దీర్ఘకాల రోగుల మరణాల శాతం పెరుగుతుందంటున్నారు. ఈ క్రమంలో మనమంతా ప్రకృతి విధ్వంసం, పర్యావరణ విధ్వంసం, కాలుష్యం వల్ల కలుగుతున్న అనర్థాలపై పాఠాలు నేర్చుకోవాలి. కనీసం ఇప్పటి నుంచి దిద్దుబాటు చర్యలను కఠినంగా అలవాటు చేస్తే ఓ వందేళ్లకు గానీ సమస్యకు పరిష్కారం దొరకదు. ప్లాస్టిక్ మన ఆరోగ్యానికి ప్రమాదమని తెలిసినా దీని వినియోగాన్ని తగ్గించుకోపోలేకపోతున్నాం. వీధులు, మురికి కాలువలు ప్లాస్టిక్ చెత్తతో నిండుతున్నాయి. నదులు,సముద్రాల్లో కూడా ప్లాస్టిక్‌ను నింపేస్తున్నాం. భూము, సముద్రానలు ఓ డంప్‌యార్డుగా చేసేస్తున్నాం. ఇటువంటి ప్లాస్టిక్ భూమిలో కలవడానికి సుమారు వెయ్యి సంవత్సరాలు పడుతుంది. దీని మూలంగా నేల కాలుష్యం జరిగి భూగర్బ జలాలు విష పూరితం అవుతున్నాయి. కాల్చితే పర్యావరణ కాలుష్యం జరుగుతుంది. పర్యావరణ సమతల్యత దెబ్బతిని దీని వలన తరచూ అడవులు కాలిపోతున్నాయి. ప్రతి సంవత్సరం 8 మిలియన్ టన్నుల కంటే ఎక్కువ ప్లాస్టిక్ సముద్రాలలో కలుస్తుంది. సముద్ర ఉపరితలంలో 40శాతం ప్లాస్టిక్ చెత్తతో కప్పబడి ఉన్నదని, ఇది ఇలా కొనసాగితే 2030 సంవత్సరం నాటికి సముద్రంలో చేపల కంటే ఎక్కువ ప్లాస్టిక్ ఉంటుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో వున్న జంతువులు, చేపలు శరీరంలోనికి ప్రవేశించి పర్యావరణానికి ఎంతో హాని కలిగిస్తున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే 2030 నాటికి 619 మిలియన్ టన్నులు అవుతుందని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. పెన్నుల నుండి ఎలక్ట్రానిక్ పరికరాలు, బొమ్మలు, ఆహార నిల్వకి ఉపయోగించే కవర్లు, ఆట వస్తువులు పి.వి.సి పైపులు, గ్లాసులు మొదలైన వస్తువులు ప్లాస్టిక్‌తోనే తయారవుతున్నాయి.ప్లాస్టిక్ చౌకగాను, సౌకర్యవంతంగా ఉండడం వలన మన జీవితంలో భాగంగా చేసుకున్నాం. ప్లాస్టిక్ వ్యర్థాల వలన మానవునికి, పర్యావరణకి వచ్చే ముప్పు అంతాఇంతా కాదు. ప్లాస్టిక్ మన జీవితాలని ఛిన్నాభిన్నం చేస్తున్నదని తెలిసినా ప్రభుత్వాలు వాటిని నిషేధించడం లేదు. ఉత్పత్తుల పై ఆంక్షలు విధించడం లేదు. దీనిపై ప్రపంచమంతా మేల్కోవాలి. ప్లాస్టిక్ వ్యర్థాలను నిషేధించాలి. ప్లాస్టిక్ ఉత్పత్తులను నిషేధించాలి. పర్యావరణ విధ్వంసానికి కారణమవుతున్న చర్యలను నిషేధించాలి. అప్పుడే ఈ భూమ్మీద మనగలుగుతామని గుర్తించాలి. అందుకు ప్రజలుగా మనమంతా వ్యక్తిగతంగా శ్రద్ధ పెట్టాలి. ప్లాస్టిక్‌పై యుద్ధం ప్రకటించారు. ప్లాస్టిక్ వాడకాలను నిషేధించుకోవాలి. ప్రభుత్వాలు కూడా పర్యావరణం కోసం యుద్ధప్రా తిపదికన చర్యలకు సిద్దపడాలి. కఠిన చట్టాలను చేయాలి. మొక్కలను పెంచడం, చెట్లు నరకకుండా చూడడం, కొండలు,గుట్టలను పరిరక్షించడం , ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించడం వంటి కఠిన చర్యలకు దిగాలి. ఢిల్లీ సమీపంలో పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా పర్యావరణం దెబ్బతింటోంది. గాలిలో ఆక్సిజన్ శాతం తగ్గిపోతోంది. ఇవన్నీ అడ్డుకోవాల్సిఉంది. ఇందుకు ఓ కమిటీని వేసి అధ్యయనం చేయించాలి. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలి. ఫ్రాన్స్ డిక్లరేషన్ తూచ తప్పకుండా అమలయ్యేలా చేయాలి. ప్రజల్లో చైతన్యం తీసుకుని రావాలి. నిరంతరం ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి. సామాజిక మాధ్యమాలు, టివిలు, పత్రికల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రచారం చేయాలి. అప్పుడే సత్ఫలితాలను సాధించగలం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇదో సవాల్‌గా తీసుకుని పర్యావరణ పరిరక్షణకు పెద్ద ఎత్తున ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది.

# తీరు మారని బిజెపి...

న్యూఢిల్లీ,సాధారణ దేశ ప్రజానీకం మొట్టికాయ వేసి, మెజార్టీ కోసం ఇతర పార్టీలపై ఆధారపడేటట్లు చేసినా నరేంద్ర మోడీ ఎన్నికల్లో కేంద్ర బిజెపి ప్రభుత్వ తీరులో మార్పు కనిపించడం లేదు. గతంలో మాదిరి అవే ఏకపక్ష విధానాలు, నిరంకుశ పోకడలను కొనసాగిస్తోంది. ప్రముఖ రచయిత్రి అరుంధతీ రారుపై ఉగ్రవాద నిరోధక చట్టం (ఉపా) ప్రయోగానికి అనుమతి ఇవ్వడమే దీనికి నిదర్శనం. కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో నడిచే ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె సక్సేనా ఈ మేరకు జారీ చేసిన ఆదేశాలు ఇప్పుడు చర్చనీయాంశంగా ఉన్నాయి. అరుంధతీ రారుతో పాటు కాశ్మీర్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోఅంతర్జాతీయ న్యాయశాస్త్ర మాజీ ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌ను కూడా ఈ చట్టం కింద విచారణకు గవర్నర్ అనుమతించారు. ఇది ఇప్పటి కేసు కాదు. పోలీసులు చెబుతున్న ఈ సంఘటన పుష్కర కాలం దాటిపోయింది. ఎప్పుడో 14 సంవత్సరాల క్రితం జరిగిన సంఘటనను తవ్వి తీసి, ఏకంగా ఉపా క్రూరమైన చట్టాన్ని ప్రయోగించడానికి సిద్ధం కావడంలోనే కేంద్ర ప్రభుత్వ కుటిలత్వం స్పష్టమౌతోంది. ఈ ఫైలు గత ఏడాది గవర్నర్ ముందుకు వచ్చినప్పుడు ఉపా చట్టం కింద పెట్టాలన్న పోలీసుల ప్రతిపాదనను గవర్నర్ తిరస్కరించారు. అప్పట్లో ఐపిసి సెక్షన్ల కింద మాత్రమే కేసు నమోదు చేయవలసి ఉంది. 2010లో న్యూఢిల్లీలో జరిగిన ఒక సదస్సులో వేర్పాటువాదాన్ని ప్రోత్సహించేలా మాట్లాడారన్నది అరుంధతీ రారు ప్రభృతులపై ఆరోపణ! అదే జరిగితే, ఆ ఉపన్యాసాల కారణంగానే వేర్పాటువాదం ఈ 14 ఏళ్ల కాలంలో బలపడిందని పోలీసులు ఆధారాలు చూపాలి. అవేమీ లేవు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత వేర్పాటువాదాన్ని అణచి వేశామని, కాశ్మీరాన్ని భూతల స్వర్గం చేశామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హెూంమంత్రి అమిత్ షాలు పదే పదే దేశ వ్యాప్తంగా చాటింపు వేస్తూనే ఉన్నారు. అయినా, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన రచయిత, హక్కుల ఉద్యమకారిణిపై అతి క్రూరమైన చట్టం కింద కేసు పెట్టడానికి బరితెగించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సంకేతాలేమిటి?ఈ కేసు విషయంలోనే కాదు. అనేక ఇతర అంశాలలోనూ మోడీ సర్కారు పోకడలు ఇదే మాదిరి ఉన్నాయి. పార్లమెంటులో సాధారణ మెజార్టీ కోసం జనతాదళ్(యు), టిడిపి లపై బిజెపి ఆధారపడింది. అయినా, ప్రత్యేక హెూదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ వంటి కీలకమైన ఒక్క సానుకూల ప్రకటన అయినా నరేంద్ర మోడీ చేయకపోవడం.



గడిచిన పదేళ్ల కాలంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరించిన విధానాలకు వ్యతిరేకంగానే దేశ ప్రజానీకం సాధారణ ఎన్నికల్లో తీర్పు ఇచ్చింది. ఈ విషయం సుస్పష్టం. అయినా, ఆయన ఏర్పాటు చేసిన మంత్రి వర్గంలో ఇసుమంత మార్పు కూడా లేదు. గతంలో ఉన్న మంత్రులనే తీసుకోవడంతో పాటు, వారికి ఆ శాఖలనే అప్పగించారు. మంత్రి వర్గంలో ఒక్క ముస్లింకూ స్థానం ఇవ్వలేదు. ఇతర అధికారులే లేరన్నట్లు గతంలో పనిచేసిన పి.కె మిశ్రాను ముఖ్య కార్యదర్శిగా, జాతీయ భద్రతా సలహాదారునిగా అజిత్ దోవల్‌ను తిరిగి నియమించారు. వీనిటన్ అర్థం మతతత్వ-కార్పొరేట్ విధానాల్లో ఎటువంటి మార్పు లేదని స్పష్టంగా చెప్పడమే. మతతత్వ విధానాల కారణంగా రక్తపుటేరుల్లో మునిగిన మణిపూర్‌ను సందర్శించి, బాధితులకు అండగా ఉండటానికి ఇప్పటికీ ప్రయత్నం చేయడం లేదు.మరోవైపు సంఘ్పరివార్, హిందుత్వ శక్తులు చెలరేగి పోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన ఒడిషాలోని బాలాసోర్‌లో బిజెపి, సంఘ్పరివార్ శక్తులు ఒక వ్యూహం ప్రకారం మతఘర్షణలను రెచ్చగొట్టాయి. ఉత్తరప్రదేశ్‌లో గోగూండాల దాడులకు దిగుతున్నారు. అరుంధతీ రారుపై ఉపన్యాసం చేయడం ప్రజల పక్షాన నిలబడి, గొంతు విప్పి, పోరాడే ప్రతి ఒక్కరికి ఒక హెచ్చరిక వంటిది. ప్రజాతంత్ర శక్తులు ఐక్యంగా కదిలి ఈ దాడిని తిప్పికొట్టడంతో పాటు రానున్న రోజుల్లోనూ అప్రమత్తంగా ఉండాలి. ప్రజల గుర్తింపు చైతన్యపరచాలి. రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడుకునేందుకు ప్రజలు, ప్రజాతంత్ర శక్తులు సదా జాగరూకులై వుండాలి.

# నాగపూర్ చారిత్రక గుణపాఠాలు



నాగపూర్ మహారాష్ట్ర శీతాకాల రాజధాని. సుందర ప్రాచీన భవనాల్లో శాసనసభ భవనం, గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల, మంత్రుల, ప్రతిపక్ష నాయకులు, శాసన సభ్యులకార్యాలయాలు, నివాసాలు, ముంబయి హైకోర్టు నాగపూర్ పీఠం, ఆర్‌బిఐ కార్యాలయం ఉన్నాయి. ముఖ్యమంత్రి కార్యాలయం పేరు హైదరాబాద్ హౌస్. పాత సుందర శాసనసభకు చర్యలు జరుగుతున్నాయి. ఈ భవనాల నిర్వహణ ఖర్చు కోట్లలో ఉంటుంది. మధ్యధరా శీతోష్ణ ముంబయిలో వేడి పెరిగి చలి తగ్గింది. శీతాకాల రాజధాని, పాలితులకు లేని సౌకర్యాలు పాలకులకు అవసరమా? ఈ భవనాలను ఇతరాలకు వాడుకొని ప్రజాధనాన్ని పొదుపు చేయవచ్చు.నాగపూర్ భారత భౌగోళిక మధ్య కేంద్రం. బ్రిటిష్ సెంట్రల్ ప్రావిన్స్ రాజధాని. ఆ ప్రభుత్వం దీన్ని ఇండియా జీరో మైల్‌గా గుర్తించింది. ఇది కమల పండ్ల నగరం. పులుల రాజధాని. నగరం చుట్టూ పులుల సంరక్షణ కేంద్రాలున్నాయి. నాగపూర్ నాగజాతి ప్రజల నగరం. (కృష్ణుడు అర్జునునితో చంపిన నాగులు వీరే) ఆర్యుల ప్రత్యర్థులైన నాగుల పేరు పాత నగరంలో పారే నదికి, ఈ నగరానికి పెట్టారని అంబేద్కర్ వాదన. నాగజాతి బోధనలను దేశమంతా ప్రచారం చేసింది. అందుకే అంబేద్కర్ బౌద్ధ దీక్షకు నాగపూర్‌ను ఎంపిక చేశారు. తన రెండవ భార్య డాక్టర్ సవిత (శారద కృష్ణారావు కబీర్)తో సహా 3 లక్షల 65 వేల అనుచరులతో బుద్ధిజానికి మారారు. అక్కడిబోలు బుద్ధ స్థూపం ప్రపంచ బోలు స్థూపాలలో పెద్దది. దీక్షాభూమిగా, పర్యాటక స్థలంగా ప్రసిద్ధిగాంచింది.మహారాష్ట్ర ఆరు పరిపాలన మండళ్ళ (డివిజన్ల)లో విదర్భ ప్రాంతంలో నాగపూర్, అమరావతి మండళ్ళున్నాయి. నాగపూర్ మహారాష్ట్ర శీతాకాల రాజధాని. సుందర ప్రాచీన భవనాల్లో శాసనసభ భవనం, గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల, మంత్రుల, ప్రతిపక్ష నాయకులు, శాసన సభ్యులకార్యాలయాలు, నివాసాలు, ముంబయి హైకోర్టు నాగపూర్ పీఠం, ఆర్‌బిఐ కార్యాలయం ఉన్నాయి. ముఖ్యమంత్రి కార్యాలయం పేరు హైదరాబాద్ హౌస్. పాత సుందర శాసనసభకు చర్యలు జరుగుతున్నాయి. ఈ భవనాల నిర్వహణ ఖర్చు కోట్లలో ఉంటుంది. మధ్యధరా శీతోష్ణ ముంబయిలో వేడి పెరిగి చలి తగ్గింది.శీతాకాల రాజధాని, పాలితులకు లేని సౌకర్యాలు పాలకులకు అవసరమా? ఈ భవనాలను ఇతరాలకు వాడుకొని ప్రజాధనాన్ని పొదుపు చేయవచ్చు. నగరంలో పచ్చని చెట్లతో చాలా పార్కులున్నాయి. కస్తూర్ చంద్ పార్కు, అమర సేనాని మేజర్ సురేంద్ర మధుసూదన్ దేవ్ పార్కు, బాలుర, ట్రాఫిక్ పార్కులు, సెమినార్ కొండపై జపాన్ పార్కు మేము చూసిన పార్కులు. ఇవిగాక వీధి జిమ్ములు, వ్యాయామశాలలు, జిమ్ములతో క్రీడా ప్రాంగణాలు ఉన్నాయి. ప్రత్యేక మందిరాల్లో రాం, హనుమాన్, రాందేవ్ కేంద్రాలతో అన్నీ పాక్షికంగా కాషాయీకరించబడ్డాయి. వాకింగ్ స్ట్రీట్‌లో ప్రోత్సాహకర సత్సూత్రాలతో విగ్రహాలను ప్రతిష్టించారు. సాంస్కృతిక కేంద్రాలు, అన్ని మతాలయాలు, జనరల్ పోస్ట్ ఆఫీస్ లాంటి పురాతన భవనాలు, 1817లో ఆంగ్లేయులతో యుద్ధం జరిగిన చారిత్రక ప్రసిద్ధ సీతా బర్డి కొండపై కోట ఉన్నాయి. కోటను సైనిక కార్యాలయాలుగా ఉపయోగించారు. జాతీయ పర్వదినాల్లో ప్రజలు కోటను చూడవచ్చు.ప్రజాపనుల శాఖ ప్రాచీన పనిముట్లు, యాంత్రిక వాహనాలను ప్రదర్శించారు. మున్సిపల్ కార్పొరేషన్‌ను సుందరంగా నిర్వహిస్తోంది. నడుములను విరగ్గొట్టే గుంతల, అటుకుల రోడ్లులేవు. రోడ్లకు ఇరువైపులా చెట్లు, కాలిబాటలున్నాయి. వేసవిలో సిగ్నళ్ళ వద్ద ఆగినవారికి ఎండతగలకుండా ఆకుపచ్చ బట్టల పందిర్లు కట్టారు. రోడ్లను, మురుగు కాలువలను రోజూ శుభ్రపరుస్తారు. వర్షాకాలం ముందు కాలిబాటల కింద ఉన్న మురుగు కాలువల్లో అడ్డాలను తొలగిస్తారు. మురుగు కాలువలు కనిపించకుండాసూక్తులను రాసిన మందపు ఆకుపచ్చ బట్టతో లేదా కృత్రిమ గడ్డితో తెరలను స్థాపించారు. తాత్కాలిక, ఒప్పంద మునిసిపల్ కూలీలు లేరు. రూ.17,500 మూల వేతనంతో రూ.29 వేల కనీస జీతాల శాశ్వత మునిసిపాలిటి ఉద్యోగులే. నాగపూర్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వ్యవస్థాపక కేంద్రం. అక్కడ గట్టి భద్రతా ఏర్పాట్లు ఉన్నాయి. సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత మోహన్ భాగవత్ అక్కడే ఉంటారు. లోపల ఒక ప్రదర్శనశాల, బయట కరసేవకుల సమావేశ స్థలం ఉంది. ఇక్కడ రోజూ ఉదయం కరసేవకులు సమావేశమవుతారు.మరొక విశాల స్థలంలో హెడ్గేవార్ స్మారక భవనం ఉంది.దీనికి ఆనుకొనిఉన్న కళాశాలల క్రీడా స్థలాలను వాడుకుంటారు. హెడ్గేవార్ స్మారక భవనంలో హెడ్గేవార్, గోళ్వాలకర్‌ల సమాధులున్నాయి.ఈ భవనంలో రోజూ స్వదేశ, విదేశాంగ సంఘ పరివార్ కార్యకర్తలకు, ప్రచారకులకు శిక్షణ ఇస్తారు. రెండువేల మంది కూర్చునే వీలుగా సమావేశ మందిరం, సరిపడా భోజనశాల ఉన్నాయి. ఈ రెండు ప్రదేశాలలో చెప్పులు విప్పి వెళ్ళాలి. చెప్పులను అడ్డదిడ్డంగా గాక వరుసల్లో పెడతారు. రెండు చోట్ల సంఘ్ కార్యకర్త దర్శకులకు ప్రదేశాలను చూపిస్తారు. నాగపూర్‌లో ఆడపిల్లలకు కర్రసాము వ్యాయామ శిక్షణ ఇస్తున్నారు. కమ్యూనిస్టు యోధుడు అర్ధేందు భూషణ్ బర్దన్ నాగపూర్ కేంద్రంగా పని చేశారు. నాగపూర్ దళిత బౌద్ధ కేంద్రం. నగరంలో ప్రజాప్రయాణ సౌకర్యాలకు ప్రభుత్వ బస్సులు, మెట్రో రైలు ఉన్నాయి. కార్పొరేషన్ కొళాయిల వీధి మంచి నీటి వసతి కల్పించింది. ఈ నగరం సువ్యవస్థిత విద్య, ప్రజారోగ్య సంరక్షణ కేంద్రం. స్వచ్ఛ భారత్ పథకం కింద 2018లో బహిరంగ మలవిసర్జన ముక్తనగరంగా ప్రకటించారు.నాగపూర్ నిరాధారుల నరకం. 1994లో 50 వేల గొవారి (పశులకాపరి) జాతి ప్రజలు ఎస్‌టి హెూదా కోరుతూ నాగపూర్ శాసనసభ వద్ద దివిటీలతో నిరసన తెలిపారు.పోలీసుల అమానవీయ కాల్పుల్లో అధికార లెక్కల ప్రకారం 114 మంది చనిపోగా, 500 మంది గాయపడ్డారు. మోడీ సర్కారు 150 ఏళ్ల స్వాతంత్ర్య అమృత మహెూత్సవాల్లో నాగపూర్‌లో ఎటిఎం, బస్, రైలు టిక్కెట్ల బుకింగ్, ఫోన్ సేవ నగర కియోస్కులను ప్రారంభించింది. నేటి స్మార్ట్ ఫోన్ యుగంలో ప్రజలకు ఇవి అనవసరం. అందువలన ఇవి వికలాంగుల, భిక్షకుల నిద్ర స్థలాలుగా, మరుగుదొడ్లుగా మారాయి. స్వచ్ఛ భారత్ వంకలో కలిసింది. వికలాంగుడు నిద్రిస్తున్న కియోస్కు ప్రక్కనే ఆకాశవాణి ఉంది. విధానసభ చెరొక వైపు 200 మీటర్ల దూరంలో, దివ్యాంగుల నమోదు కేంద్రం ఉన్న మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం 100 మీటర్ల దూరంలో ఉంది. రైల్వే స్టేషన్ మెట్రో స్టాప్ వద్ద రెండు చోట్ల ఏ ఆచ్ఛాదన లేని మురికివాడలో రెండు కుటుంబాలు పసిపిల్లలతో పాటు ఉన్నాయి. వారికి స్నానాల గదులు, మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేవు. అక్కడే కట్టెల పొయ్యి మీద వండుకొని తింటున్నారు.వీళ్ళు పగలంతా తక్కువ కూలికి కష్టపడి పని చేస్తారు. దేశోత్పత్తికి సాయపడతారు లేదా రోడ్ల కూడళ్ళలో చిన్నవస్తువులు అమ్ముకొని బతుకుతారు. మురికి గుడ్డల గుట్టలు వీళ్ళ నివాసాల పక్కనే ఉన్నాయి. మునిసిపల్ కార్మికులు ఈ ప్రదేశాలను, కియోస్కు దొడ్లను పట్టించుకోరు. ఓట్లు లేని ఈ దిక్కులేని వారిని వేల కోట్లు ఖర్చుపెట్టిన స్వచ్ఛ భారత్, స్వయం సేవకులు, సుపరిపాలకులు పట్టించుకోలేదు. అక్కడే పుట్టి పెరిగిన పౌరసత్వంలేని వీరికి ఇళ్ళతో సహా ఏ ప్రభుత్వ పథకమూ రాదు. వ్యవసాయ విద్యాలయం దగ్గర ధ్యానచంద్ హాకీ ఆటస్థలం తర్వాత రోడ్డుకు ఇరువైపులా కాలిబాటలపైనే పేదలు నివాసాలను ఏర్పర్చుకున్నారు. విధానసభ చౌక్‌లో రెండు, మూడు భిక్షక కుటుంబాలు కాలిబాటలపైన, ట్రాఫిక్ ఐలాండ్‌లో రాత్రులు నివాసముంటాయి. అక్కడే మూత్రమలవిసర్జన చేశారు. భారత పాలకులు, పాలితులు నాగపూర్ నాకనరకాల నుండి గుణపాఠాలు నేర్వాలి. సుపరిపాలన, సుపౌరసత్వం అభివృద్ధి చేయాలి.

## కాంగ్రెస్‌లో చేరడం లేదన్న బండ్ల..పుకార్లను నమ్మవద్దని వినతి

జోగులాంబ గద్వాల, తాను కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నాననే వార్తలు పూర్తిగా అవాస్తమని బీఆర్ఎస్ గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కొట్టిపడేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పత్రికలలో, సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మొద్దన్నారు. తాను బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు తనపై ఒత్తిడి తీసుకొచ్చినప్పటికి ఆ పార్టీలో చేరబోనన్నారు. చివరి వరకు కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ కోసం పని చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు ఉన్నారు.

## ఎమ్మెల్యే పేరిట ఫేస్‌బుక్ అకౌంట్

గుంటూరు, అమాయకులే లక్ష్యంగా సైబర్ కేటుగాళ్లు రోజురోజుకీ కొంతపంథా ఎంచుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నూతన ఎమ్మెల్యేల పేరిటా మోసాలకు దిగుతున్నారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రవణ్ కుమార్ పేరుతో సైబర్ కేటుగాళ్లు ఫేస్‌బుక్ నకిలీ ఎకౌంట్ తెరిచారు. రాజధాని ఎమ్మెల్యే పేరుతో ఎకౌంట్ క్రియేట్ చేసి సామాన్యులతో చాట్ చేస్తూ డబ్బులు అడుగుతున్నారు. తన పేరిట మోసాలకు పాల్పడుతున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రవణ్ కుమార్ వెంటనే స్పందించారు. తన పేరుతో ఎవరు డబ్బులు అడిగినా ఇవ్వొద్దంటూ చెప్పారు. ఇలాంటి మోసాల పట్ల నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్ లైన్ మోసాల బారిన పడి డబ్బులు పోగొట్టుకోవద్దని సూచించారు. ఎమ్మెల్యే పేరిట సైబర్ కేటుగాళు వసూళ్లకు పాల్పడడంతో నియోజకవర్గ ప్రజలు అవాక్కయ్యారు.

## గ్రామీణ సమస్యలపై తక్షణ చర్యలు

విజయవాడ,గ్రామాలలో మౌలిక వసతులు, రోడ్ల నిర్మాణం, మంచినీటి ఎద్దడి నివారణ వంటి అంశాలపై ఐఏఎస్ అధికారులకు డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ పలు సూచనలు చేశారు.ప్రణాళికలు సిద్ధం చేసి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. మూడు నెలల తర్వాత పనుల పురోగతిపై పునఃసమీక్ష చేస్తానన్నారు. ఈ మూడు నెలల కాలంలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించవద్దని అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హితవు పలికారు. డిప్యూటీ సీఎంగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రిగా పవన్ కల్యాణ్ బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక పూజల అనంతరం అధికారిక పత్రాలపై ఆయన సంతకం చేశారు. ఉపాధి హామీ పథకానికి ఉద్యానవన పనులను అనుసంధానించే నిధుల మంజూరు, గిరిజన గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణ్గ ÷ళ్లైపై ఉపముఖ్యమంత్రిగా తొలి సంతకాలు చేశారు. ÷ాధ్యతల స్వీకరణ అనంతరం పవన్ కల్యాణ్ ఆయా శాఖలకు సంబంధించిన పనులను చకచకా ప్రారంభించారు. తన క్యాంపు ఆఫీసులో ఐఏఎస్ అధికారులతో ఉప ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పలు కీలక అంశాలపై చర్చించారు.

## గుత్తాను తొలగించే ఎత్తులు

హైదరాబాద్,ఎన్నికల హడావిడి ముగియడంతో ఇక రాజకీయ ఎత్తులు,పైఎత్తులకు తెలరలేవనుంది. ఎవరు ఎటువైపు ఉంటారన్నది తేలనుంది. మొత్తంగా బిఆర్ఎస్ రాజకీయంగా భారీ మూల్యాన్ని చెల్లించుకుంటుందనడంలో సందేహం లేదు. మరో ఐదేళ్ల వరకు బిఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. అప్పటి వరకు కేసులు, అవినీతి వ్యవహారాలతో బిఆర్ఎస్ మరింతగా మూల్యం చెల్లలించుకో తప్పదు. ఈ క్రమంలో బిజెపి, అధికార కాంగ్రెస్‌ల మధ్యనే రాజకీయం నడవనుంది. అలాగే శాసన మండలిలో తమ బలాన్ని పెంచుకునేందుకు కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌కు సన్నద్ధమవుతోందన్న ప్రచారం వినిపిస్తోంది. ఈ క్రమంలో మండలి ఛైర్మన్ గుత్తాపై బీఆర్ఎస్ పెట్టడం ద్వారా పట్టు సాధించాలని బిఆర్ఎస్ ప్రతివ్యూహాలు పన్నుతోంది. అవిశ్వాస తీర్మానం, దీన్ని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ అనుసరించనున్న వ్యూహాలు.. తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారనున్నాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య పట్టు కోసం తెలంగాణ శాసన మండలి వేదికకానుందనడంలో సందేహం లేదు. ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు బీఆర్ఎస్ అధిష్టానం రెడీ అవుతోందని తెలుస్తోంది. ఇకపోతే మండలి ఛైర్మన్ గుత్తా సహా మెజార్టీ ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం కూడా ఉంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పోల్చితే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగలడంతో మండలిలో పట్టుకు కాంగ్రెస్ వ్యూహాలు పన్నుతున్నట్లు సమాచారం. అధికార కాంగ్రెస్‌తో సన్నిహితంగా ఉంటున్న శాసన మండలి ఛైర్మన్ గుత్తాకు వ్యతిరేకంగా అవిశ్వాసం నెగ్గితే రాజకీయంగా పైచేయి చాటుకోవచ్చని బీఆర్ఎస్ అధిష్టానం వ్యూహాలు పన్నుతున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలోరాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అవిశ్వాస తీర్మానాలతో స్థానిక సంస్థలను అన్నింటిని కైవసం చేసుకుం టోంది. అసెంబ్లీ ఎన్నికలు విజయ దుందిభీ మోగించిన కాంగ్రెస్.. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా గట్టి పట్టునే సాధించింది. మరోవైపు బీఆర్ఎస్ కు ఒక్క సీటు కూడా రాకుండా కాంగ్రెస్ ఖంగు తినిపించింది. శాసనసభలో బలం లేకపోయినా.. పెద్దల సభ శాసనమండలిలో ఆధిపత్యాన్ని ప్రదర్శించాలని బిఆర్ఎస్ భావిస్తోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్, బిజెపిల వైపు గోడ దూకేందుకు సిద్ధమవుతు న్నారనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కాంగ్రెస్‌తో సన్నిహితంగా ఉండడం, పార్లమెంట్ ఎన్నికల టైంలో సుఖేందర్ రెడ్డి కొడుకు అమిత్ రెడ్డి కాంగ్రెస్ చేరడాన్ని బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలవేళ బీఆర్ఎస్‌లోని గుత్తా అనుచరులు మొత్తం గంపగుత్తగా కాంగ్రెస్ చేరారు. తొలుత అమిత్ రెడ్డి నల్గొండ, భువనగిరి నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ ఎంపీ టికెట్ ఆశించగా.. ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ మాజీ ఎమ్మెల్యేలు వ్యతిరేకించారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ పెద్దలకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సుఖేందర్ రెడ్డి.. కేసీఆర్, బీఆర్ఎస్‌పై ఫైర్ అయ్యారు. కేసిఆర్ చెప్పుడు మాటలు వినడం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యామని ఎంపీ ఎన్నికల సమయంలో గుత్తా సుఖేందర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఈ పరిణామాల నేపథ్యంలో సుఖేందర్ రెడ్డిని ఛైర్మన్ పదవి నుంచి దింపాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు సమాచారం. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌లో నెగ్గడం ద్వారా అధికార కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేయవచ్చునే చర్చ బీఆర్ఎస్ వర్గాల్లో జరుగుతోంది. గుత్తాపై అవిశ్వాస తీర్మానంలో నెగ్గితే ఓ రకంగా రేవంత్ రెడ్డి దూకుడుకు చెక్ పెట్టినట్టేనని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి..తెలంగాణ శాసన మండలిలో మొత్తం సభ్యుల సంఖ్య 40 కాగా, ప్రస్తుతం రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ రెండు మినహాయిస్తే ప్రస్తుతం మండలిలో 38 మంది ఎమ్మెల్సీలు ఉన్నారు. మండలి ఛైర్మన్ పదవి నుంచి దింపడానికి మొత్తం సభ్యుల్లో 2/3 వంతు మెజార్టీ ఉండాలి. ప్రస్తుతం 27 మంది సభ్యులు అవిశ్వాసానానికి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ప్రస్తుతం బీఆర్ఎస్ పక్షాన 31 మంది ఎమ్మెల్సీలు ఉన్నట్టు మండలి రికార్డులు చెప్తున్నాయి. కానీ దామోదర్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి కాంగ్రెస్ లో చేరారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ ఎమ్మెల్సీగా గెలిచారు. ఛైర్మన్ సుఖేందర్ రెడ్డితో కలిపితే కాంగ్రెస్ సంఖ్య ఆరుకు పెరిగింది. వీరిని మినహాయిస్తే బీఆర్ఎస్ తరఫున 26 మంది ఉంటారు. ఎంఐఎంకు ఇద్దరు ఎమ్మెల్సీలు ఉండగా, బీజేపీకి ఒకరు ఉన్నారు. టీచర్ ఎమ్మెల్సీలు ఇద్దరు ఓటింగ్ కు దూరంగా ఉండే అవకాశం ఉంది.

# విచారణ కమిషన్‌నే ధిక్కరిస్తారా


హైదరాబాద్,జ్యుడీషియల్ విచారణను మాజీ సీఎం కేసీఆర్ తప్పు పెట్టాల్సిన అవసరం ఏముందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అధికారిని దిగిపో అనాల్సిన పనేముంది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెళ్లి వివరాలు ఇవ్వచ్చుగా అన్నారు. కేసీఆర్ ఎందుకు అంత భయపడుతున్నారని తెలిపారు. రుణమాఫీకి కట్టుబడి ఉన్నామని తెలిపారు. రైతు బంధు వేయరు అనే ప్రచారం చేశారు.. కానీ వేసి చూపించామన్నారు. రుణమాఫీ మిలాగా నాలుగు సార్లు చేస్తామని.. అనలేదన్నారు. అందరూ మిలాగే ఉంటారని అనుకోకండి అన్నారు. మేము చెప్పిన మాట ప్రకారం రుణమాఫీ చేస్తామని క్లారిటీ ఇచ్చారు. మేము ప్రజాస్వామ్యం నమ్మే వాళ్లుగా? విచారణకు అదేశించామన్నారు. కక్ష సాధింపు కోసం వేసిన కమిషన్ కాదన్నారు. గతంలో విద్యుత్ శాఖ మంత్రిగా చేసిన ఆయనే విచారణ అడిగితే వేశామన్నారు. కమిషన్ ఎవరు ఉండాలని మేము వేసింది కాదు.. మాకు సంబంధం లేదని క్లారిటీ ఇచ్చారు. మేము ఎవరం రోజు వారీ సమీక్ష చేయడం లేదన్నారు. జ్యుడీషియల్ విచారణ తప్పు పెట్టాల్సిన అవసరం ఏముందని తెలిపారు. జగదీశ్ రెడ్డి నే.. జ్యుడీషియల్ విచారణ అడిగారని తెలిపారు.తెలంగాణ లో లా అండ్ ఆర్డర్ మా ఫస్ట్ ప్రేయారిటి అన్నారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే వ్యక్తులను ఉక్కుపాదంతో అనిచివేస్తామన్నారు. బ్యాంకర్ల వార్షిక రుణప్రణాళిక ఆవిష్కరించారు. బ్యాంకర్లకు సామాజిక, మానవీయ కోణం ఉండాలన్నారు. పెట్టుబడులకు స్వర్గధామం హైదరాబాద్ అన్నారు. బ్యాంకర్స్ కు పాజిటివ్ దృక్పథం లేకపోతే ఏ రాష్ట్రం అభివృద్ధి చెందదు అన్నారు. నిరుపేదలు, మధ్యతరగతి వర్గాలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.÷ఖజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో తెలంగాణ రూపురేఖలు మారిపోతున్నాయన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధితో ఈ రాష్ట్రం అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడనుందన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి చెల్లింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం రూపాయి కూడా పెండింగ్లో పెట్టదన్నారు. ఆయిల్ ఫామ్ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహాలు అందిస్తుందన్నారు. సూక్ష్మ, మధ్యతరహ పరిశ్రమలకు ఎక్కువ రుణాలు ఇవ్వాలి అభి అత్యధిక జనాభాకు ఉపాధి కల్పించేవన్నారు. బలహీన వర్గాలకు విరివిగా రుణాలు ఇస్తేనే రాష్ట్రం సమగ్ర అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలో మిగులు విద్యుత్తు ఉంది.. రెప్పపాటు కూడా కరెంటు కోతలు లేవన్నారు. రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చిన విద్యుత్ సరఫరాకు ఇబ్బంది ఉండదన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త విద్యుత్ పాలసీని తీసుకురాబోతోందన్నారు. దేశ సంపద అన్ని వర్గాలకు సమానముగా పంచాలనేది రాహుల్ గాంధీ ఆలోచన అన్నారు. ఉమ్మడి కుటుంబం మాదిరిగా జాతి ఐక్యంగా ఉండాలని రాహుల్ గాంధీ విధానమన్నారు. అదే జాతికి ఆయన పిలుపు నిచ్చారన్నారు. దేశ సంపద అందరికి పంచాలని రాహుల్ గాంధీ విధానం అన్నారు.

# ఒకే భూమి చట్టం దిశగా..

హైదరాబాద్, భూమి సమస్యలన్నింటికీ పరిష్కారం చూపే విధంగా ఒకే భూమి చట్టం తీసుకు రావాలన్న దిశగా కాంగ్రెస్ సర్కారు తీవ్ర కసరత్తు చేస్తోంది. రైతులకు, మేధావులకు కూడా అర్థం కానీ విధంగా ఉన్న దాదాపు 124 భూమి చట్టాలన్నింటినీ కలిపి, వడపోసి, వాటి స్థానంలో ఒకే చట్టం తీసుకురానున్నది. ఈ మేరకు ఇటీవల ధరణి కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమైన రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూములకు ఒకే చట్టం ఉండాలని, ఈ మేరకు ఒకే చట్టం తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని ప్రకటించారు. ఈ చట్టాన్ని తీసుకు రావడం ద్వారా సమస్యల పరిష్కారంలో ఏర్పడే గందరగోళం తొలగి పోతుందని న్యాయ నిపుణులు చెపుతున్నారు. వీలైనంత తొందరగా తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. అసవరం అయితే వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే ఈ బిల్లు తీసుకు రావాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.'భూ సమస్యల పరిష్కారాన్ని సామాన్యులకు అందుబాటులో లేకుండా చేసే ఏ చట్టమైనా దుర్మార్గమైనదే. వివాదం సృష్టించి కోర్టుకు వెళ్లి పరిష్కరించుకోండని చెప్పడం అంటే సామాన్య హక్కులను గుంజుకొని సంపన్నుల/ బలవంతుల చేతిలో పెట్టడమే" అని సమాచారహక్కు మాజీ కమిషనర్, సీనియర్ పాత్రికేయులు కట్టా శేఖర్ రెడ్డి ఎక్స్‌లో చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ దిశగా తెలంగాణ ప్రభుత్వం భూమి సమస్యల పరిష్కారాన్ని సామాన్య ప్రజలకు అందుబటులో ఉండే విధంగా ప్రభుత్వం తీసుకువచ్చే ఒకే రెవెన్యూ చట్టం ఉండాలన్న అభిప్రాయం రైతుల కోసం పని చేస్తున్న అనేక సంఘాల నాయకులు వ్యక్తం చేస్తున్నారు.వాస్తవంగా నిజాం పరిపాలనలో తెలంగాణకు ఒకే ఒక రెవెన్యూ చట్టం ఉండేది. ఈ చట్టాన్ని 1907వ సంవత్సరంలో నాటి నిజాం పాలకులు తీసుకు వచ్చారు. ఈ చట్టమే తెలంగాణ ఆంధ్రలో విలీనం అయ్యే వరకు అమలులో ఉంది. ఈ ఒక్క చట్టం ద్వారానే భూమి సర్వే, సెటిల్‌మెంట్, పరిపాలన, భూ రికార్డుల నిర్వహణ అంతా పకడ్బందీగా జరిగింది. నిజాం సంస్థానం భారత్‌లో విలీనం అయిన తరువాత ఏర్పడిన హైదరాబాద్ స్టేట్‌లో తెలంగాణ రెవెన్యూ చట్టానికి అదనంగా వ్యవసాయ భూములు, కౌల్దారీ చట్టం, హైదరాబాద్ ఆర్వో ఆర్ చట్టాలు వచ్చాయి. అయితే తెలంగాణకు రెవెన్యూ చట్టం ఉన్న సమయంలో బ్రిటిష్ పాలన కింద ఉన్న మద్రాస్ ప్రెసిడెన్సీలో భూ పరిపాలన బోర్డ్ ఆఫ్ స్టాండింగ్ ఆర్డర్స్ కిందనే జరిగేది కానీ ప్రత్యేక చట్టం లేదు.తెలంగాణను ఆంధ్రలో విలీనం చేసిన తరువాత తెలంగాణ రెవెన్యూ చట్టాన్ని నిర్వీర్యం చేసి, అనేక చట్టాలను తీసుకు వచ్చారు. ఇలా దాదాపు 124 చట్టాలను తెచ్చారు. దేశంలో దాదాపు ఐదు వేల చట్టాలున్నట్లు తెలుస్తోంది. దీంతో ఏచట్టం ఏ సమస్యకు పరిష్కారం చూపుతుందనేది కూడా తెలుసుకోలేని పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికి కూడా కీలకమైన సమస్యలు పరిష్కరించాలంటే 100 ఏళ్ల క్రితం చేసిన చట్టం వెలుగులోనే పరిష్కరించాల్సిన పరిస్థితి ఉందని భూ సంబంధ నిపుణులు అంటున్నారు.వాస్తవంగా ఉమ్మడి రాష్ట్రంలో దేవేందర్ గౌడ్ రెవెన్యూ మంత్రిగా ఉన్న సమయంలో 1999లో ఒకే చట్టాన్ని తయారు చేశారు. అసెంబ్లీ ఆమోదం పొందిన బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి కేంద్రానికి పంపి చేతులు దులిపేసుకున్నారు. ఆ తరువాత దీనిని ఎవరూ పట్టించుకోలేదు. ఈలోగా నాడు దేవేందర్ గౌడ్ పోర్ట్ఫోలియో కూడా మారింది. ఆ నాడే అమలులోకి రావాల్సిన కోడ్ అలాగే మరుగున పడిపోయింది. వాస్తవంగా రెవెన్యూ చట్టం అనేది రాష్ట్రాల పరిధిలోనిది. దీనిని రాష్ట్రపతి ఆమోదం కోసం పంపాల్సిన అవసరం లేకున్నా.. ఆనాడు ఎందుకు పంపిచారో, ఏ ప్రయోజనాల కోసం పంపించారో నేటికి మిస్టరీగానే మిగిలిందని సీనియర్ పాత్రికేయులు గుర్తు చేసుకుంటున్నారు. తాజాగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఒకే రెవెన్యూ చట్టాన్ని తీసుకు వస్తామని ప్రకటించారు.దేశంలో ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో రెవెన్యూ కోడ్ అమలులో ఉంది. దీనిని యూపీ రెవెన్యూ కోడ్ అని పిలుస్తారు. యుపీలో 2016లో వచ్చిన ఈ చట్టం అమలులో సక్సెస్ అయింది. దేశంలో చాలా రాష్ట్రాలు ఈ దిశగా ప్రత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒడిశా హైపవర్ కమిటీని ఏర్పాటు చేసింది.రైతుల భూముల హక్కుల విషయంలో చిక్కుముళ్లు లేకుండా భూముల సమస్యలన్నింటికీ పరిష్కారం చూపే విధంగా

# ఏమిటీ ప్రోటెం స్పీకర్..? ఎలా, ఎవరు, ఎందుకు నియమిస్తారు..?

అమరావతి : ఆంధ్ర ప్రదేశ్ ఎన్నికల్లో అద్భుత విజయం సాధించిన తెలుగుదేశం, జనసేన, బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్ బాధ్యతలు. మంత్రులు కూడా బాధ్యతలు చేపట్టి ఎవరిపనుల్లో వారు బిజీ అయిపోయారు. ఇలా ఇప్పటికే నూతన పాలనాయంత్రాంగం సెట్ అయిపోయింది. ఇక మిగిలింది అసెంబ్లీ సమావేశాలే. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం, స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎంపిక కోసం రెండు రోజులపాటు అంటే ఈ నెల 21,22 తేదీల్లో అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. అయితే ఈ అసెంబ్లీ సమావేశాల్లో టిడిపి సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రోటెం స్పీకర్ గా వ్యవహరించనున్నారు. ఇప్పటికే అసెంబ్లీ మంత్రి పయ్యావుల కేశవ్ ఫోన్ చేసి ప్రోటెం స్పీకర్ గా వ్యవహరించారు. దీంతో గోరంట్లతో ముందుగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రమాణస్వీకారం చేయించి ప్రోటెం స్పీకర్ గా నియమించబడ్డారు. గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రోటెం స్పీకర్ గా ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలోనే అసలు ప్రోటెం స్పీకర్ అంటే ఏమిటి? ఆయనను ఎవరు నియమిస్తారు? ఎవరు దీనికి అర్హులు? అనేది తెలుసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు.



**అసలేమిటీ ప్రోటెం స్పీకర్:**

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్. విదేశీ పాలననుండి విముక్తిపొందాక స్వపరిపాలన కోసం మనం రూపొందించుకున్నదే రాజ్యాంగం. అయితే ఇందులో ప్రోటెం స్పీకర్ అన్న పదమే లేదు. అంటే ఇది రాజ్యాంగబద్ధమైన పదవి కాదని స్పష్టమవుతుంది. అయితే కొత్తగా ఎన్నికైన లోక్ సభ, అసెంబ్లీలకు స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎంపికకు సమయం పడుతుంది. కాబట్టి అప్పటివరకు ఆయా సభల వ్యవహారాలు రాష్ట్రపతి, గవర్నర్లు చూసుకోవచ్చు లేదంటే తమ ప్రతినిధిని నియమించాలని రాజ్యాంగం చెబుతోంది. ఈ లోక్ సభలో అయితే ఎన్నికైన ఎంపీల్లో ఒకరిని రాష్ట్రపతి... రాష్ట్రాల అసెంబ్లీల్లో అయితే ఎమ్మెల్యేల్లో ఒకరిని గవర్నర్ తన ప్రతినిధిగా నియమిస్తారు. ఆయనే ప్రోటెం స్పీకర్.

**ప్రోటెం స్పీకర్ బాధ్యతలు :**

రాజ్యాంగం ప్రకారం ప్రజలచే ఎన్నుకోబడిన ఎంపీలు లోక్ సభలో... ఎమ్మెల్యేలు రాజ్యసభలో ప్రమాణస్వీకారం చేయవలసి ఉంటుంది. ఇతర ప్రోటెం స్పీకర్ ను ఎంపిక చేస్తారు. అయితే, స్పీకర్ స్పీకర్ అనేవి రాజ్యాంగబద్ద పదవులు... వీరికి అధికారాలు ఉంటాయి. కానీ ప్రోటెం స్పీకర్ అనేది తాత్కాలిక పదవి... ఒక్కసారి స్పీకర్ ఎంపిక జరిగితే ఆటోమెటిక్ గా ఈ పదవిలోనివారు ఎమ్మెల్యేగా మారిపోతారు. కాబట్టి ప్రోటెం స్పీకర్ కు ప్రత్యేకంగా ఎలాంటి అధికారాలు వుండవు.

**ఎవరిని ప్రోటెం స్పీకర్ గా ఎంపిక చేస్తారు :**

సాధారణంగా ఎన్నికైనవారిలో సీనియర్ సభ్యుడిని ప్రోటెం స్పీకర్ గా ఎంపిక చేస్తారు. లోక్ సభలో అయితే ప్రధాని, లోక్ సభ వ్యవహారాల మంత్రి, రాష్ట్రాల్లో అయితే ముఖ్యమంత్రి, శాసనసభ వ్యవహారాల మంత్రి ఈ ప్రోటెం స్పీకర్ ను ఎంపిక చేస్తారు. వీరు ఎంపికచేసే సభ్యుడినే రాష్ట్రపతిగాని, గవర్నర్లుగాని తన ప్రతినిధిగా (ప్రోటెం స్పీకర్) నియమిస్తారు. అయితే అందరిచేత ప్రమాణస్వీకారం చేయిస్తే ప్రోటెం స్పీకర్ తో రాష్ట్రపతి అయితే, రాష్ట్రంలో అయితే గవర్నర్లు ప్రమాణస్వీకారం చేస్తారు. ఆ తర్వాత వారు కొత్తగా ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేలతో ప్రమాణస్వీకారం చేస్తారు. ఆ తర్వాత స్పీకర్, డిప్యూటీ స్పీకర్ నియామకం జరగగానే ప్రోటెం ప్రస్తావన వుండదు. ప్రోటెం స్పీకర్ ఎంపికకు వయసు రిత్యా సినియారిటీని కాకుండా సభలో సినియారిటీని పరిగణలోకి తీసుకున్నారు. ఒకవేళ సభలోని సీనియర్ సీఎంగా, మంత్రిగా వుండివుంటే ఆ తర్వాత సీనియారిటీ కలిగినవారిని నియమిస్తున్నారు. ఇలా సీనియర్ నే ప్రోటెం స్పీకర్ నియమించాలన్న నిబంధన ఏమీ లేదు... కానీ ఇది సభా సాంప్రదాయంగా మారింది. ఆంధ్ర ప్రదేశ్ విషయానికి వస్తే కొత్తగా ఏర్పడిన 16 శాసన సభకు ప్రోటెం స్పీకర్ గా వ్యవహరించనున్న గోరంట్ల బుచ్చయ్య చౌదరి కంటే చంద్రబాబు నాయుడు సభలో సీనియర్. కానీ ఆయన ముఖ్యమంత్రిగా వ విరుద్ధంగా గోరంట్ల ప్రోటెం స్పీకర్ గా వ్యవహరించనున్నారు. ఆయనతో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణస్వీకారం చేస్తారు.

# ఫిరాయింపులతో బీజేపీకే లబ్ధి!

హైదరాబాద్,రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలోనే ఒక చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫిరాయింపులపై కీలక వ్యాఖ్యలు చేశారు. తాము అలాంటి ప్రయత్నం చేయమని, కానీ అవతలి పక్షం నుంచి అలాంటి యత్నాలు ఏవైనా జరిగితే అది ఎక్కడిదాకా వెళ్తుందో చెప్పలేమన్నారు. రేవంత్ ప్రభుత్వ మనుగడకు వచ్చిన ప్రమాదమేమీ లేదు. కానీ బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలను ఎందుకు తీసుకోవాల్సి వస్తున్నదనేది ఇప్పుడు తలెత్తుతున్న ప్రశ్న. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలలో 90 శాతానికి పైగా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. ఒకరిద్దరు తమ వ్యక్తిగత చరిష్మాతో పాటు ప్రజల్లోనే ఉండటం ద్వారా గెలువగలిగారు.ఫిరాయింపు రాజకీయాల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పొరపాట్లనే రేవంత్ సర్కార్ చేస్తున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఆ పార్టీ ముగ్గురు ఎమ్మెల్యేలను చేర్చుకోగా.. రానున్న రోజుల్లో మరికొంత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హస్తం గూటికి చేరుతారనే వార్తలు వస్తున్నాయి. అయితే ప్రధాన పార్టీలు ఒక విషయాన్ని మరిచిపోతున్నాయి. తెలంగాణ అసెంబ్లీ ఫలితాలు, మొన్నటి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. బలమైన ప్రతిపక్షం ఉండాలన్నది ప్రజల తీర్పులో స్పష్టంగా కనిపించింది.ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా పార్టీల్లో చీలిక తెస్తామని ఏ రాజకీయపార్టీ భావించినా దానికి ఆ పార్టీ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని గత నిదర్శనాలు ఉన్నాయని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ఉదాహరణకు మహారాష్ట్రలో బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి మొదట శివసేనలో చీలిక తీసుకొచ్చింది. అంతటితో ఆగకుండా ఎన్సీపీలోనూ చీలిక తెచ్చింది. తాను చీలిక తెచ్చి, కాషాయ కూటమిలో కలుపుకొన్న పార్టీలే అసలైనవని మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో నరేంద్రమోదీ చెప్పారు. కానీ ప్రజల తీర్పు దానికి విరుద్ధంగా వచ్చింది. ఈ విషయాలను చూసిన తర్వాత అయినా రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం ఫిరాయింపు రాజకీయాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలన్నది అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.కేంద్రంలో మోదీ సర్కార్ మూడోసారి అధికారంలోకి వస్తే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వాలను కూల్చేస్తామని ఆ పార్టీ నేతలు బహిరంగంగానే సంకేతాలు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈసారి బీజేపీకి సొంతగా మెజార్టీ దక్కలేదు. కాబట్టి ఇప్పుడు ఆ ప్రయత్నాలను తాత్కాలికంగా వాయిదా వేయవచ్చు. కానీ కాంగ్రెస్ పార్టీ విషయంలో బీజేపీ అజెండాగానీ, మోడీ, షాల వైఖరిగానీ మారుతుందని భావించనక్కర్లేదని విశ్లేషకులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో టీడీపీ, జేడీయూ కీలకంగా ఉన్నాయి. కనుక ఇక్కడి రేవంత్ ప్రభుత్వాన్ని మోదీ కూల్చకుండా అడ్డుకుంటారనే అభిప్రాయం ఉన్నది.అయితే చంద్రబాబు ప్రస్తుతం ఏపీ ప్రయోజనాలు, ఆ రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు కేంద్రం నుంచి



రాబట్టడం వంటి అంశాలపైనే ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. మరోవైపు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణలోనూ టీడీపీ పోటీ చేయాలని యోచిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఖమ్మం జిల్లా పార్టీ నేతల సమావేశానికి వెళ్లిన చంద్రబాబు ఇక్కడి నుంచే పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తానని వ్యాఖ్యానించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తారని భావించినా ఇక్కడ కొన్ని సీట్లు సాధించడం కంటే ఏపీలో అధికారంలోకి రావడమే ముఖ్యమని అనుకున్నారు. అందుకే పోటీకి దూరంగా ఉన్నారు. కానీ తెలంగాణలో తన పార్టీ జెండాను పీకేయాలనే ఆలోచన ఆయనలో లేదన్నది స్పష్టంగా కనిపిస్తున్నదని చెబుతున్నారు.బీఆర్ఎస్ మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి టీడీపీలో చేరనున్నారనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆయనకే రాష్ట్ర పగ్గాలు అప్పగిస్తారన్నది ఆ వార్తల సారాంశం. దాన్ని మల్లారెడ్డి ఖండించినా ఒకవేళ రానున్న రోజుల్లో ఒకవేళ అలాంటి పరిణామాలు జరిగితే చంద్రబాబు తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ ఎంట్రీ ఇవ్వనున్నారనే అంశంలో స్పష్టత వస్తుంది. అలాంటి ప్రయత్నం జరిగితే టీడీపీ ఏపీలో వలె (టీడీపీ, జనసేన, బీజేపీ) కూటమిలా ఇక్కడ కూడా అదే రిపీట్ చేసే అవకాశం ఉన్నది. అక్కడ టీడీపీ ఎక్కువ సీట్లు తీసుకున్నట్టు ఇక్కడ బీజేపీ ఎక్కువ సీట్ల తీసుకోవచ్చు.ఖమ్మం, హైదరాబాద్ చుట్టుపక్కల నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన పోటీ చేసే అవకాశాలను కొట్టిపారేయలేమని రాజకీయ విశ్లేకులు చెబుతున్న మాట. ఈ నేపథ్యంలో రేవంత్ ప్రభుత్వం బీఆర్ఎస్‌ను బలహీనపరిస్తే అది అంతిమంగా బీజేపీకి అవకాశంగా మారుతుందని పలువురు చెబుతున్నారు. గతంలో రాష్ట్రంలో ప్రతిపక్షమే లేకుండా చేయాలని భావించిన కేసీఆర్.. కాంగ్రెస్‌ను బలహీనపర్చారు. కానీ.. ఆ గ్యాప్‌ను బీజేపీ భర్తీ చేసింది. అంతేకాదు.. అదే బీఆరెస్‌ను మింగుతూ రెండో బలమైన పార్టీగా ఎదుగుతున్నది. ఈ నేపథ్యంలో అదే తప్పిదాన్ని కాంగ్రెస్ చేస్తే.. అది అంతిమంగా బీజేపీకే లబ్ధి చేకూర్చుతుందని ప్రగతిశీల శక్తులు హెచ్చరిస్తున్నాయి.

# రాహుల్ గాంధీ ప్రజల మనిషి...

హైదరాబాద్,రాహుల్ గాంధీ ప్రజల మనిషని, బీజేపీ అరాచక పాలనను ఎండగడుతూ అనునిత్యం పోరాటం చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న ఘనత రాహుల్ గాంధీకే దక్కుతుందని తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు.కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని పటాన్చెరువు పట్టణ అధ్యక్షులు, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు కోల్కూరి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పటాన్ చెరు ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలకు మంత్రి కొండా సురేఖ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని నీలం మధు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

**ముగ్గురు పిల్లలకు నగదు రివార్డ్ .. నీలం మధు**

రాహుల్ గాంధీ జన్మదినమైన జూన్ 19న పటాన్ చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం జన్మించిన పిల్లలకు ఒక్కొక్కరికి రూ. పదివేల ను ప్రకటించారు. బుధవారం జన్మించిన ఒక మగ బిడ్డకు మంత్రి సురేఖ చేతుల మీదుగా పదివేల రూపాయల చెక్కును అందజేశారు. రాహుల్ జన్మదిన సందర్భంగా చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం పట్ల నీలం మధును మంత్రి కొండా సురేఖ



అభినందించారు.అనంతరం నీలం మధు మాట్లాడుతూ భారత దేశ ఉజ్వల భవిష్యత్తుకు రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమన్నారు. దేశంలో అన్ని వర్గాలకు న్యాయం జరిగి భారత్ ను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో భారత్ జోడో యాత్ర చేపట్టి ప్రజల అందరిని ఏకం చేసి వారి మనసులను గెలుచుకున్న ఘనత రాహుల్ కి దక్కుతుందన్నారు. మొన్న జరిగిన లోక్ సభ ఎన్నికల్లో నైతిక విజయం కాంగ్రెస్ దేనని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొల్లూరు మల్లేష్, చంద్రారెడ్డి,సదర్ మల్లేష్, యూసుఫ్,గుండ్ల మహేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి,

# విద్యార్థులకు డిజిటల్ లెసన్స్ ప్రసారం

హైదరాబాద్,తెలంగాణ లోని పాఠశాల విద్యార్థులకు బ్రిడ్జ్ కోర్స్ డిజిటల్ పాఠ్యాంశాలు ప్రసారం చేసేందుకు టి-సాట్ సిద్ధమైంది. ఈ నెల 20వ తేదీ గురువారం నుండి డిజిటల్ పాఠాలు టి-సాట్ విద్య ఛానల్ లో ప్రసారం కానున్నాయి. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4:05 గంటల వరకు ప్రసారాలు కొనసాగనున్నాయి. టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి బుధవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో ప్రసారాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆధునిక సాంకేతికతో కూడిన విద్యను అందించాలనే ఆలోచనలో భాగంగా డిజిటల్ పాఠ్యాంశాలు ప్రసారం చేస్తున్నట్లు సీఈవో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి బ్రిడ్జి కోర్స్ లో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 30వ తేదీ వరకు ఆదివారం మినహాయించి తొమ్మిది రోజుల పాటు పాఠ్యాంశ ప్రసారాలుంటాయన్నారు. అరగంట నిడివిగల పాఠ్యాంశాలు ఉదయం పది గంటలకు మూడవ తరగతి విద్యార్థుల నుండి ప్రారంభమై పదవ తరగతి విద్యార్థుల వరకు డిజిటల్ పాఠాలు కొనసాగుతాయని వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. డిజిటల్ లెసన్స్ మ్యాథ్స్, హిందీ, ఇంగ్లీష్, సైన్స్ తో పాటు మిగతా స్జబెక్ట్ ల్లో రోజుకు మూడు గంటలు తొమ్మిది రోజులు పాటు 27 గంటలు ప్రసారమౌతాయన్నారు. మూడు భాషల్లో సిద్ధమైన లెసన్స్ తెలంగాణ విద్యాశాఖ ఆధ్వర్యంలోని సైట్ (స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ) తయారు చేసిన పాఠ్యాంశాల షెడ్యూల్ ఇప్పటికే రాష్ట్రంలోని ఆయా పాఠశాలలకు చేరిందని గుర్తుచేశారు. ఆఫ్ లైన్ లో రెగ్యులర్ గా ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలకు అనుబంధంగా ఈ డిజిటల్ పాఠ్యాంశాల ప్రసారాలు కొనసాగనున్నాయని సీఈవో స్పష్టం చేశారు. జూన్ మొదటి వారంలో పాఠశాల విద్యాశాఖ అందించే రెగ్యులర్ షెడ్యూల్ పాఠ్యాంశాలకు సంబంధించిన వివరాలను అందించనున్నామని, విద్యార్థులు-వారి తల్లిదండ్రులు డిజిటల్ పాఠ్యాంశాల ప్రాధాన్యతను గుర్తించాలని సీఈవో వేణుగోపాల్ రెడ్డి సూచించారు.

# రైతులను గుర్తించే పనిలో ప్రభుత్వం

హైదరాబాద్, రైతుభరోసా మాదిరే రుతు రుణమాఫీకి కూడా విధివిధానాలు రాబోతున్నాయి. ఇందుకు పేదరికమే గీటురాయి కానుంది. అసలుసిసలు రైతులను గుర్తించబోతున్నారు. మోతుబరి రైతుల రుణాలను లెక్కలోకి తీసుకోవద్దన్న సూచనలు వచ్చాయి. దీంతో కేవతం వ్యవసాయం కోసం రుణాలు తీసుకున్న బక్కరైతులకే లబ్ది చేరూర్చేలా రుణమాఫీని చేయబోతునట్లు సమాచారం.'పీఎం కిసాన్' పథకంలో ఉన్న నిబంధనలనూ రుణమాఫీలో అమలుచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై దాదాపు తుది నిర్ణయానికి వచ్చినట్టు విశ్వసనీయంగా తెలుస్తోంది.దీని ప్రకారం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారు, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఆదాయ పన్ను కడుతున్న వారికి రుణమాఫీ అందేందుకు అవకాశం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న రైతులు, మిగతా చిన్న ఉద్యోగస్తులు కూడా వివిధ అవసరాల నిమిత్తం ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేస్తున్నారన్న అంశం తెరమీదకు వచ్చింది. రిటర్నులు దాఖలు చేశారన్న కారణంతో ఆ రైతులను మాఫీ నుంచి మినహాయించే అవకాశాలు లేవని, ఆదాయ పన్ను కడుతున్న వారినే మినహాయించే ఆలోచన ఉందని తెలుస్తోంది. ఆ మేరకు ఐటీ రిటర్నులు దాఖలుచేస్తున్న చిన్న రైతులకు, చిన్న ఉద్యోగస్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ÷ఖటన్నింటిపై ఏంచేయాలనేదానిపై 4రోజుల్లో మంత్రివర్గ సమావేశం నిర్వహించి రుణమాఫీ అమలుకు తీసుకోవాల్సిన విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేయనుంది. రైతులకు రుణమాఫీని తొలి ఏకాదశి, అంటే జూలై 17న మొదలుపెట్టనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. రుణమాఫీ పక్రియను జూలైలోనే ప్రారంభిస్తే అప్పటికే వ్యవసాయ పనులు ముమ్మరమై పెట్టుబడి అవసరమైన రైతులకు మళ్లీ రుణం తీసుకునేందుకు అవకాశం కలుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. జూలైలో ప్రారంభించి ఆగస్టు వరకు మొత్తం 3 విడతల్లో ఈ పక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ప్రభుత్వం ఆశించిన స్థాయిలో నిధుల సమీకరణ కొలిక్కివస్తుండటంతో.. అన్నదాతలకు హామీనిచ్చిన ఆగస్టు 15 వరకు కాకుండా.. ఒక నెల ముందుగానే పక్రియను ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు పీఎం కిసాన్‌లో అమలుచేస్తున్న నిబంధనలను రుణమాఫీకి కూడా వర్తింపజేసినా ఈ పథకం కోసం రూ. 25వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. రుణమాఫీకి అర్హులైన కుటుంబాలను గుర్తించేందుకు భూమి పాస్‌బుక్, రేషన్ కార్డు, ఆధార్‌కార్డులతో పాటు బ్యాంకుల ఖాతాలను ప్రామాణికంగా తీసుకుంటారు. అదే విధంగా ఈ పక్రియ మొత్తం పూర్తయ్యేవరకు రైతులకు ఏవైనా ఇబ్బందులు తలెత్తితే పరిష్కరించేందుకు వీలుగా ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్‌ను కూడా ఏర్పాటుచేయనున్నారు. ఈ క్రమంలో అసలు రైతులను కూడా గుర్తించి రికార్డులు నమోదు చేయనున్నారు. రుణాలను తీసుకుని ఏయే పంటలు వేశారన్నది కూడా లెక్కలోకి రానుంది.

# 24న ఎపి కేబినేట్ భేటీ

అమరావతి,ఏపీలో కొత్త ప్రభుత్వ కొలువుదీరిన తర్వాత తొలి కేబినెట్ భేటీకిముహూర్తం ఖరారైంది. ఈ నెల 24న సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఉదయం 10 గంటలకు మంత్రివర్గం భేటీ కానుంది. ఈ మేరకు కేబినెట్ సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై ప్రతిపాదనలు పంపాలని అన్ని ప్రభుత్వ శాఖలకు సర్కారు ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 21న సాయంత్రం 4 గంటల్లోపు ప్రతిపాదనలు పంపాలని స్పష్టం చేసింది. ఈ క్రమంలో సీఎం సంతకాలు చేసిన డీఎస్సీ పోస్టుల భర్తీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్నా క్యాంటీన్ల ఏర్పాటు వంటి నిర్ణయాలను ఆమోదించనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, నూతన మంత్రులు ఒక్కొక్కరుగా బాధ్యతలు స్వీకరిస్తున్నారు. సచివాలయాల్లో తమకు కేటాయించిన బ్లాకుల్లో బాధ్యతలు స్వీకరిస్తున్నారు. బుధవారం డిప్యూటీ సీఎం, మంత్రిగా జనసేనాని పవన్ కల్యాణ్, హోంమంత్రిగా వంగలపూడి అనిత తమ ఛాంబర్లలో బాధ్యతలు స్వీకరించారు. ప్రత్యేక పూజల అనంతరం బాధ్యతలు చేపట్టగా.. వారికి నేతలు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు. అలాగే, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగా పయ్యావుల కేశవ్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై తొలి సంతకం చేశారు. అనంతరం దీనిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అటు, కొత్తగా ఎన్నికైన శాసనసభ్యుల ప్రమాణస్వీకారం, స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక కోసం ఈ నెల 21 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 21, 22 తేదీల్లో సమావేశాలు జరగనున్నాయి. ఈ క్రమంలో ప్రొటెం స్పీకర్‌గా టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి వ్యవహరిస్తారు. ఈ మేరకు ఆయనకు ఏపీ శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ ఫోన్ చేసి ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించాలని కోరారు. ప్రొటెం స్పీకర్‌గా గురువారం ఆయనతో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణస్వీకారం చేయించనున్నారు.

